# హితోపదేశమ్

నూతిపళ్ళెం చేసుకున్న అదృష్టం చెప్పమంటారా? మార్నింగు టెండలో, పెరట్లో మా నూతిపక్క లేడీస్ రవికల్ను విడిచేసి చీరల్ను విడవకుండా (బేచ్ ఆఫ్టర్ బేచ్) రాణిగారి తోటలో ఏపుగా పెరిగిన పూలమొక్కల్లా నీళ్ళోసుకుంటూ, సబ్బిళ్ళలరగదీస్తూ, యితరులు విడిచేసిన బట్టలుతుకుతూ, ఎవరో తిన్న కంచాల్నీ యింకెవరికోసమో వండిన అంట్ల గిన్నెల్నీ తొలుస్తూ, వీరిమీద వారూ, వారి మీద వీరూ నీళ్ళు జల్లుకుంటూ, వీపులు పరస్పరం రుద్దుకుంటూ, గాజులగరగరల్తో కోకిల్స్‌మల్లె పాడుతూ, చిలకతల్లుల్లా కబుర్లుచెప్పుకుంటూ వుంటారు. ఎండదేవుడు వచ్చి ఆ బంగారు తల్లుల్ని వెచ్చగా తాకితే, ముంగురుల్తో ముచ్చట్లాడి బుగ్గమీద చిటికేసి కవ్వించి నవ్వించి మరీ వెళ్తాడు మిస్టర్ గాలి. ఎండ చురుక్కుమని పొడిస్తే, గాలిపెట్టే గిలిగింతలకు ఒదుగుతూ ఒయ్యారాలు పోతూ, గడపలుదాటి నిష్క్రమిస్తారు భామలు యిళ్ళల్లోకి తమ తమ ప్రేమగూళ్ళల్లోకి.

స్నానాలు చేసొచ్చిన ఆడాళ్ళు కడిగిన ముత్యాల్లాగుంటారు. అలా వాళ్ళు సంపాదించుకునే ఫ్రెష్‌నెస్‌ని వాళ్లు పొయ్యిముందు ఖర్చుపెట్టేయక తప్పదుకదా – గృహిణికి యింట్లో ఫోర్సుడ్ లేబర్, చాకిరీ తప్పదు కదా – పాపం వాళ్ళ చాకిరీ వాళ్ళ మనసుల్ని అరగదీయకుండా వుంటే అలాటి ఆడాళ్లు పూజాపుష్పాల్లా మెరిసిపోతూంటారు. జుట్టు ఆరబెట్టుకుంటూ, వంగునీ కూర్చుని లేచీ, యిటూ అటూ పరిగెత్తి ఆ పనీ ఈ పనీ చేసుకునేసరికి, సబ్బిళ్ళలా అరిగిపోకుండా ఏ అమ్మాయి వుంటుందీ? రమణిముద్దులగుమ్మకి ఆనందంతో కబుర్లు చెబుతూ కూర్చోడానికి వీలెక్కడిది? చీరకట్టుకున్నాక రవిక తొడుక్కోకుండానూ, పవుడరు రాసుకున్నాక తిలకం తీర్చిదిద్దుకోకుండానూ, వాగుతున్న రేడియోని కట్టేయకుండానూ, ఆగిపోయిన అలారం టైంపీసుకి కీ యివ్వకుండానూ, పక్కమీది జాజిపూలను దులిపేయకుండానూ, రాత్రి బెడ్ సైడున విడిచేసిన మెళ్ళోని గొలుసు, తలలోని పిన్నులూ, పిన్నీసులూ, రిబ్బను ముక్కలూ, మంచం కింది ఫలారం ప్లేటూ – మరచెంబూ, దిండు కింది సవరం, కాళ్ళకాడి దిక్కున ముడతలుపడ్డ బ్లాంకెట్. బ్లాంకెట్లో సిగ్గు విడిచేసిన లంగాలూ లుంగీలూ, రాత్రి చదువుతూ చదువుతూ మంచంకిందకు విసిరేసిన పుస్తకాలూ, పత్రికలూ అన్నీ ఎక్కడవక్కడ సర్దేసి లైఫ్‌ని నార్మల్ టోన్‌లోకి లాక్కురావడానికి రమణి ముద్దులగుమ్మకు ఎంత టైమూ, ఎనర్జీ కావాలో ఎవరైనా ఎప్పుడైనా ఆలోచించారా? నిప్పులకుంపట్లోపడ్డ రామచిలుకలాగా, మీ గృహరామచిలుక టపటపా కొట్టుకునే వేళ, ధూమ్రాక్ష ధూమకేతువుల్లాగా ఎగిరెగిరిపడ్డవే కాని మీరెప్పుడైనా కాసింత కనికారం ఆ ప్రాణిమీద చూపించారా? అటువంటివేళ రేజర్ కనపడలేదనీ, అండర్ వేర్ ఆరలేదని, కాఫీ చల్లారిందనీ, ఉప్మాలో ఉప్పెక్కువయిందనీ, కరివేపాకు సరిగా వేగలేదనీ, జీడిపప్పు మాడిందనీ, ఇడ్డెన్లు ఎర్రబడ్డాయనీ, ఇంగువెక్కువైందనీ, టవల్ కనబడ్డంలేదనీ,

బెల్టుకొక్కెం వూడిపోయిందనీ, షూ లేసులెక్కడికో పరిగెట్టాయనీ, దువ్వెన కనబడలేదనీ, గోలచేయడం మానరా? మానకపోతే మీలో అడ్జెస్టు మెంటాలిటీ సున్నా బిగ్ జీరో అన్నమాట.

మీ ఆవిడ మీతో వేగుతోందంటే, ఆవిడ వెర్రి వేపకాయ అనుకునేరు. ముమ్మాటికీ కాదు. ఆవిడ పేషన్సుకి పరిపూర్ణా పిక్చర్ అన్న మాట! ఎలాగో చెప్పమంటారా? మీకు లాగు తొడిగి చొక్కా వేసి టోపీ పెట్టి బుగ్గమీద చిటికేసి, జోడు ఓ కాల్డో కాలికి తొడుక్కోకుండా చూసి, పర్సు జేబులోపెట్టి, వక్కపలుకూ తమలపాకులు చేతికందిస్తేనే బెస్ట్ వైఫంటారా? లేకపోతే రమణి ముద్దులగుమ్మ బిగ్ యాసా? మీరే బిగ్ యాసులు. మీరంతా బ్రూటులే. రమణీలలామ ఎవరీమె అంటూ హీలవేసుకుంటూ వెంటబడ్డ మీరే, హీనంగా నలిపి నల్లేరుకాడను చేసి బంగారు పాప లాంటి చిన్నదాన్ని కంగారుపాపను చేసి గృహలక్ష్మిని గృహచీమగానో గృహబల్లిగానో మార్చేస్తారు. షీర్ ఎక్స్ప్లాయిటేషన్. ఆదర్శపు టిల్లాళ్ళకు సంసారంలో అట్టడుగున కనిపించేది హింసే - ఆ హింసకు పైపూతే ప్రణయం. అహింసాత్మక ప్రణయాలు ఎక్కడా లేవు. దవుర్జన్యం చోటుచేసుకోని దాంపత్యాలు భూస్థలమంతా వెదికినా కనపడవు. ఆలంకారికులు కళాకారులు ఏవేవో చమత్కారమైన పేర్లు పెట్టి దాంపత్యజీవితానికి అట్టడుగున అంతార్వాహినిగా ప్రవహించే హింసాకాండను నైతికంగా సమర్థించారు. కోరికల్ని చంపుకోవడం హింసే, కోరికల్ని తీర్చుకోవడమూ హింసే - ఈ ఆధ్యాత్మికపు హింసలను సహించి బ్రతుక్కురావడమే సక్సెస్ఫుల్ జీవితం. జీవితానికి ఆడదానికైనా మగాడికైనా వున్న దొకటే కీ. దానిపేరే అడ్జస్టు మెంటాలిటీ. నిన్నటి మరకల్ని మనసుమీద పడకుండా చెరిపేసుకో! ఒకవేళ పడితే కన్నీళ్ళతో కడిగేసుకో.... రోజువారీ దవుర్జన్యాలనూ అత్యాచారాలనూ ఎవ్వీరి ఉదయం నూతిగట్టున సబ్బిళ్ళెట్టి కడిగేసుకోకపోతే, నిత్యమల్లి పూవులా కలకలలాడుతూ, కిలకిలా నవ్వుతూ జీవితం నూతిపళ్ళాన్ని తాజాగా మజాగా వుంచడం ఎలా సాధ్యం? జీవితానికి నిన్న పట్టిన చీకటిలాటి మకిలిని నూతిపళ్ళేందగ్గర సబ్బునురగతో వదిలేయకపోతే ఫ్రెష్గా నిలబడి జీవితపు రసరామణీయకాల్ని ఆస్వాదించడం ఎలాగెలాగ?

అసలు పెళ్ళాం ఎంత తాజాగా, ఎంత సౌందర్య తిలకంలా వున్నా, దాని బ్యూటీనంతా రొటీనుకింద లాగేసి మగాడు ఖాతిరీ ఆట్టేచేయడు. చాలామంది పతివ్రతామతల్లులు మొగుడ్ని సేమ్ ఓల్డు డర్టీరోగ్ క్రింద కట్టేసి ఎడ్జస్టు మెంటాలిటీ కడు నైపుణ్యంగా ప్రదర్శిస్తారు. మనది మహాపతివ్రతల దేశంకదా - అంటే పతివ్రతలైనవారి సంఖ్య ఎక్కువగానూ, కానివారి సంఖ్య తక్కువగానూ వుంటుంది. దీనినిబట్టి పతివ్రతగా వుండటమే సులభం కాకపోవడంకంటె అని తేలుతోంది. పతివ్రతలు మెజారిటీకల దేశం కాబట్టి మనది పవిత్ర భారతదేశమయింది. మనం గోవునెంత హీనంగా చూస్తామో, ఆడదాన్నీ అంతే హీనంగా చూస్తాము. మనం పవిత్రమని భావించే వాట్నన్నిటికీ గోరీలు కట్టి మాత్రవే పూజిస్తాము. మన కంట్రీ బాగుపడాలంటే స్త్రీలను పవిత్రంగా పూజాపుష్పాల్లాకాదు చూడవలసినది. వాళ్ళను రక్తమాంసాలున్న మనుషులుగా గుర్తిస్తేచాలు. మొగుడిదగ్గర రొటీను బ్యూటీగా చలామణి అయ్యే ఆడది అందుకే నూతిపళ్ళెం

దగ్గర ఒరిజినల్ విగరూ పొగర్తో పైలాపచ్చీసుగా కనబడ్తుంది. అదొక రేర్ పోర్ట్రెయిట్ ఆ రేర్ పోర్ ట్రెయిట్ని భద్రంగా దాచుకోగలగాలి. సంసారపు గృహశిథిలాల్లో ఆ షాకిల్స్ మధ్య ఆడదాని నిజరూపాన్ని గుర్తించడం సాధ్యం కాదు. అందుకనే నేర్పుగా అప్రయత్నంగా "షెన్ షి ఈజ్ ఫ్రీ అండ్ ఫుల్లీ హర్ ఓన్సెల్ఫ్" చూడగలితే, మగ వాడి జీవితం ధన్యమైనట్లే. కళాయి మాసిన బొక్కిఅద్దాల్లాటి మనసులు కల మగాళ్ళకు ఇల్లాలి ప్రతిబింబం అంతసులువుగా కంటికి ఆనదు. ది అన్నోన్ సైడ్ ఆఫ్ ఎ పెళ్ళాంగురించి తెల్సుకోవడానికి ప్రతిమొగుడూ ట్రయిచేయాలి. ట్రయ్ అండ్ ట్రయ్ ఎగైన్ అన్నాడు కాళిదాసు! నూతిపళ్ళైవంటే ది అన్నోన్ సైడ్ ఆఫ్ ఎ పెళ్ళామ్సు రొటీన్ బ్యూటీ (ఈ వ్యాసంలోని ఇంగ్లీషు ప్రయోగాల్ను ఇంగ్లీషు మొగుళ్ళు అంటే ఇంగ్లీషు వచ్చిన వారనే అర్థం. ఇంగ్లీషురాని తమతమ భార్యలకు ఏకాంతమందు చక్కగా బోధపర్చాలని నా ఉద్దేశం. వైస్ వెర్సాకూడాను.)

# అత్తగారూ - ఎర్తుక్వేకూ

కొడుక్కి పెళ్ళయీ అవగానే టపీమని అత్తగార్రైపోవడం, చచ్చీచెడి దుంపల్తెంపల్చేసుకుని కూతురికి పెళ్ళిచేసి అత్తగారనిపించుకోవడం ఒకటి కాదుగదా? కాదుకాదు. లెక్చరర్ ముదరగానే హెడ్డాఫ్ ది డిపార్ట్మెంటవుతాడు. అత్తగార్ల లైన్ ఆఫ్ యాక్టివిటీకూడా అంతే! గుమాస్తా ముదిరి తాసిల్దారయినట్లు, గుమ్మటంలాటి కోడలు ముదిరి ముదిరి చూస్తూండగా అత్తగార్రైపోతుంది. మరి అత్తగారి అత్తగారేమవుతుందటా అనే దవుటు కలగొచ్చు. అప్పుడా ముసలావిడ రిటైర్డ్డెప్టీ కలెక్టరులానో రిటైర్డ్ డీవై యస్పీలానో తయారవుతుంది! రిటైర్డ్ డెప్టీ కలెక్టర్లూ రిటైర్డ్ డీవైయస్పీలూ పళ్ళూడిన బోసిపులుల్లాగానూ కళ్ళు కనబడని ఎరమింగిన ముసలి త్రాచుల్లాగానూ పడకగదుల్లోంచి భోజనాల సావిట్లోకి భోజనాల సావిట్లోంచి వరండాలోకి సణుక్కుంటూ, సీవపందుల్నీ సీవదొరల్నీ మెచ్చుకుంటూ, ఇండియాని ఇండియన్ మెంటాలిటీనీ ద్వేషిస్తూ, పేపరు చదివి విసిరి అవతల పారేస్తూ, కుర్రాళ్ళని మందలిస్తూ, మందల్ని కన్నందుకు విచారిస్తూ ఇళ్ళల్లో తిరుగుతూంటారు. పళ్ళూడిన బోసి పులుల్తోనూ కళ్ళు కనపడని ముసలి త్రాచులతోనూ కలిసి జీవించడం ఇంపాసిబులింపాసిబులనుకుంటూంటారు. యంగ్మెన్స్ అండ్ యంగ్ లేడీస్.

మా సందు నిండా గెలవేయని అరటి మొక్కల్లాంటి సుశీలలు సీతలు రాధలు బోల్డు మందున్నారు. ఒక్కరికీ కాల్నిలువదు. తోటలో నెమిళ్ళలా గెంతుతూంటారు. రంగుల బొంగరాల్లాగ యిక్కడా, అక్కడా ఎక్కడ చూచినా వాళ్ళే! కిలకిలా నవ్వుతూ కొత్త పేకముక్కలాగ ముట్టుకుంటే జర్రున జారిపోయేట్లుంటారు వాళ్ళ కబుర్ల జలపాతం నయాగరా వాటర్ ఫాల్స్ని